సాగునీరు అందేదెలా?

- గెడ్డలు కబ్జా చేసి నిర్మాణాలు
- నీరు రాక ఎండిపోతున్న చెరువులు
- పక్వానికి వచ్చిన వరిపంటకు అందని నీరు
- ఆందోళనలో అన్నదాతలు

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో సాగునీటి వనరులు ఆక్రమణలకు గురయ్యాయి. ఆయకట్టు చెరువులకు ప్రధాన నీటి మార్గాలైన గెడ్డలు, వాగులు, కాలువలను పలువురు కబ్జాచేసి ప్రహరీలు, ఇళ్లు, షెడ్లు నిర్మించేశారు. మరికొన్ని చోట్ల కాలువలను కప్పేసి రోడ్లు ఏర్పాటు చేశారు. ఫలితంగా ఆయకట్టు చెరువుల్లో వర్షాకాలంలో నీరు రాకపోవడంతో ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఆయకట్టు భూముల్లో వరి పండిస్తున్న రైతులు నీటి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్లో ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని, నీటి పారుదల శాఖాధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగన్నాథపురంలో సూరీడు చెరువుకు నీటి మార్గాలైన కొండ గెడ్డ, గొర్రి గెడ్డలను చుట్టు పక్కల వారు ఆక్రమించుకున్నారని రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు గెడ్డల ద్వారా ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షపునీరు సూరీడు చెరువులోకి వచ్చి చేరుతుంది. ఈ చెరువు కింద ఉన్న సుమారు 50 ఎకరాల్లో ప్రతిఏటా వరి సాగు చేస్తున్నారు. ఈ రెండు గెడ్డలను ఇటీవల కాలంలో స్థానికులు కబ్జా చేశారని, గ్రామం మధ్యలో నుంచి కాలువ ఉండటంతో ఆక్రమించి ఇళ్లు, ప్రహరీలు నిర్మించడంతో పాటు, రోడ్డు మార్గం ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి ఎగువ ప్రాంతంలో ఉన్న పోలవరం కాలువ వద్ద కూడా దిగువ ప్రాంతానికి వర్షపు నీరు వెళ్లే మార్గాన్ని కూడా చుట్టుపక్కల రైతులు కబ్జా చేసి వరి, కూరగాయల పంటలు సాగుచేస్తున్నారు. సూరీడు చెరువు కింద సాగు చేసిన వరిపంట పక్వానికి చేరుకుంది. ఈ సమయంలో నీరు చాలా అవసరం. గెడ్డలను కబ్జాచేయడం వల్ల సూరీడు చెరువులోకి వర్షపునీరు రావడం లేదని, వర్షాలు పడిన సమయంలో చెరువులో చేరిన నీటినే ఉపయోగించుకుని సాగుచేయాల్సిన పరిస్థితి తలెత్తిదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద సాగునీటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కానీ స్థానిక సిబ్బంది ఈ గెడ్డలను గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఈ రెండు గెడ్డల్లో పూడిక తీత చేపట్టి, ఆక్రమణలు తొలగించాలని, సూరీడు చెరువు కింద ఆయకట్టు భూములకు సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. జగన్నాథపురంలోనే కాకుండా గొడిచర్ల, కాగిత గ్రామాల్లో కూడా చెరువులు, పంట కాలువలు కబ్జాకు గురయ్యాయి. అలాగే సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే భూమి కాలువ పాయకరావుపేట జాతీయ రహదారి నుంచి తాండవ సుగర్ ఫ్యాక్టరీ వరకు ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. కాలువ గర్భం కుదించుకుపోయి ఖరీఫ్‌లో విడుదలయ్యే జలాలు చివరి ఆయకట్టు వరకు వెళ్లని పరిస్థితి నెలకొంది. నీటి పారుదల శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరువులు వాటి ఆయకట్టు భూములకు సాగునీరు అందించే నీటి మార్గాలను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.


జగన్నాథపురంలో కబ్జా చేయడంతో కనుమరుగైన కొండ గెడ్డ


చుక్కనీరు లేని సూరీడు చెరువు


పూడికపోయిన గెడ్డ

ఆక్రమణలు తొలగించాలి



జగన్నాథపురంలో సూరీడు చెరువుకు ప్రధాన నీటి వనరులైన కొండ గెడ్డ, గొర్రి గెడ్డలు ఆక్రమణలకు గురయ్యాయి. కబ్జా చేసి రోడ్లు, ప్రహరీలు, ఇళ్లు నిర్మించారు. ఫలితంగా వర్షాలు పడిన సమయంలో నీరు చెరువులోకి కాకుండా ఇళ్లల్లోకి వస్తోంది. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ చెరువు కింద సుమారు 50 ఎకరాలు వరి సాగు చేస్తున్నాం. పంట పక్వానికి వచ్చింది. వర్షాలు పడినప్పటికీ చెరువులో నీటి చుక్క లేదు. అధికారులు స్పందించి గెడ్డల ఆక్రమణలు తొలగించి పూడిక తీత చేపట్టాలి.

– నారపు రెడ్డికుమారి, మహిళా రైతు, జగన్నాథపురం

తాండవ కాలువలో పేరుకుపోయిన పూడిక

కోటవురట్ల: తాండవ కాలువ నుంచి సాగునీరు అందక రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు. సాగునీటిని విడుదల చేసినా పొలాలకు నీరు అందని పరిస్థితి ఉంది. తాండవ కాలువలో పూడిక తీయకపోవడంతో శివారు రైతులకు సాగునీరు అందడంలేదు. దీంతో ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాండవ జలాశయం ఆయకట్టు పరిధిలో మండలంలో సుమారు 2 వేలు ఎకరాలు ఉన్నాయి. ఇందులో సుమారు 1200 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం వరి చేలు పొట్టపోసుకునే దశలో ఉండడంతో సాగునీటి కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. పాములవాక దాటి కాలువ నుంచి నీరు రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాలువలో పూడిక తీసి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


భీమిరెడ్డిపాలెంలో తాండవ కాలువ దుస్థితి

క్లుప్తంగా

మరిడిమాంబకు వెండి బహూకరణ

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట మరిడిమాంబ అమ్మవారికి కసిరెడ్డి అప్పారావు, లక్ష్మి దంపతులు ఆదివారం తులం వెండి బహూకరించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా పలువురు దాతలు తమవంతు సాయం అందిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులకు వెండి అందజేసి భక్తిని చాటుకున్నారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందాలి


తిమ్మరాజుపేటలో ఓటరు నమోదు వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆయన ఆదివారం పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో జరిగిన నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. 18 సంవత్సరాలు దాటిన యువతీ, యువకులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేర్పులు,మార్పులతో పాటు కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

19వ రోజుకు భిక్ష సదుపాయం


అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష స్వీకరిస్తున్న స్వాములు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భిక్ష సదుపాయం ఆదివారానికి 19వ రోజుకు చేరుకుంది. 40 రోజుల పాటు స్వాములకు మధ్యాహ్న సమయంలో భిక్ష సదుపాయం కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప,గే శివస్వాములు భిక్ష సదుపాయాన్ని వినియోగించుకున్నారు.

అందుబాటులో రైతుల జాబితా


నీటి సంఘ ఎన్నికలకు రైతుల జాబితా ప్రదర్శిస్తున్న వీఆర్వో సురేష్

మునగపాక: త్వరలో జరగనున్న సాగునీటి సంఘ ఎన్నికలకు సంబంధించి రైతుల జాబితాను మునగపాక సచివాలయ ప్రాంగణంలో ఆదివారం వీఆర్వో సురేష్ ప్రదర్శించారు. సాగునీటి సంఘ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉన్న రైతుల జాబితాను పొందుపరిచారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సురేష్ కోరారు.

'కూటమి పాలనలో నిరుద్యోగులకు నిరాశ'

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే ఎదురైందని సీపీఎం సెంట్రల్ కార్యదర్శి కె.ఈశ్వరరావు ధ్వజమెత్తారు. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్–1, గ్రూప్–2 పరిస్థితులు కూడా అగమ్యగోచరంగానే ఉన్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ. 20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ నాన్చుడు వైఖరి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగిస్తుందన్నారు.

రేవుపోలవరం తీరంలో సందడి


తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

ఎస్.రాయవరం: సందర్శకులతో రేవుపోలవరం తీరం ఆదివారం కళకళలాడింది. ప్రతి ఏడాది కార్తిక మాసంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి ఇక్కడ పిక్నిక్‌లు నిర్వహించుకుంటారు. శని, ఆది, సోమవారాల్లో ఈ సందడి రెట్టింపు స్థాయిలో ఉంటుంది. ఏడాదికేడాదికి రేవుపోలవరం తీరానికి పర్యాటకులు తాకిడి పెరుగుతూనే ఉంది.

ఆదివారం కూడా తీరానికి పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి, ఇసుక తిన్నెల్లో ఆటపాటలతో సందడి చేశారు. మధ్యాహ్నం సమీప కొబ్బరి, జీడి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి

ధర్మవరం మినహా
మిగతా ప్రాంతాలకు నేడు నీటి సరఫరా

యలమంచిలి రూరల్: పట్టణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న సోముదేవపల్లి నీటి పథకానికి సంబంధించిన పైపులైను మరమ్మతు పనులు ఆదివారం సాయంత్రానికి పూర్తయ్యాయి. నాలుగు రోజుల క్రితం పైపులైనుకు లీకేజీ కారణంగా నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరమ్మతు పనులు పూర్తి కావడంతో పట్టణంలో మూడు రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా సోమవారం పునరుద్ధరించనున్నట్టు పురపాలక సంఘం అధికారులు తెలిపారు. ఒక్క ధర్మవరం మినహా మిగిలిన ప్రాంతాలన్నింటికీ సోమవారం నీటి సరఫరా జరుగుతుందన్నారు.


పురుషోత్తపురం వద్ద పైపులైన్‌కు పూర్తయిన మరమ్మతు పనులు

15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు

అనకాపల్లి: విజయనగరంలో ఈ నెల 15న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు నిర్వహించనున్నట్టు ఉత్తరాంధ్ర విద్యార్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ తెలిపారు. గాంధీనగరం ఎస్సీ వసతి గృహం వద్ద ఆదివారం ఈ మేరకు ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు–విద్య, ఉపాధి రంగ సమస్యలు–కర్తవ్యాలు' అనే అంశంపై జరిగే ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. పాలక వర్గ పార్టీలు వారి రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం రాష్ట్రంలో ఉత్తరాంధ్రను కావాలని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్, సెంట్రల్ యూనివర్సిటీని, విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలన్నారు. మూతపడిన జూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులు కేటాయించాలన్నారు. ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలని కోరారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా కమిటీ సభ్యులు జి.చందు, టి.గణేష్, ఈ.ఉదయ్ కిరణ్, మహేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగరం ఎస్సీ వసతి గృహం వద్ద చర్చా వేదిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్.భాస్కర్

'క్రీడా కోటాలో కోతలు తగవు'

అనకాపల్లి: క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం 62 క్రీడల్లో ప్రాముఖ్యత కల్పిస్తూ విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్లో జీవో 74 నంబర్ విడుదల చేసి 29 క్రీడలకు పరిమితం చేయడం దారుణమని జాతీయ టెన్నీకాయిట్ సమైక్య టెక్నికల్ కమిటీ చైర్మన్, రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె.ఎస్.వి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడా దుస్తులు, రవాణా చార్జీలు, పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. వివిధ క్రీడల్లో ఎంపికైన గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి కోచ్‌ను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వైద్య సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు

ఎస్.రాయవరం: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని శ్రీకుసుమ కావ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శానాపతి బాబూరావు అన్నారు. మహాత్మా గాంధీ క్యానర్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అడ్డురోడ్డులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 18 మంది మహిళా వలంటీర్లు వైద్య సిబ్బందిని ఇంటింటికి తీసుకువెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ప్రసాదులు గణేష్, శానాపతి పరుషరామ్, అప్పికొండ బుజ్జి, కోన దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్....

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మునగపాక మధ్య వీధిలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. అడుగుభాగం దెబ్బతినడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పందించాల్సిన అధికారి : బుద్ధ ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ, ఫోన్ నంబరు 8498052613.

– మునగపాక

అటవీ అమరవీరులకు ఘన నివాళి


అటవీ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గంపా లక్ష్మణ్, తదితరులు

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీ డివిజనల్ ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో ఆదివారం ఉదయం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి డివిజన్ ఫారెస్ట్ అధికారి గంపా లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1939 నుంచి నేటి వరకు ఎంతో మంది అటవీ అధికారులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అమరులయ్యారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంరక్షణ, అటవీ శాఖలో అంకింత భావంతో విధులు నిర్వహించిన వ్యక్తులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని నాలుగు రేంజ్‌లు, సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం


శ్రీనివాసుని ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న చంద్రచారి

మునగపాక: మునగపాకలో తలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో పలువురు దాతలు భాగస్వామ్యులవుతున్నారు. తమవంతు సాయం అందజేస్తూ భక్తిని చాటుకుంటున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గెద్దం గంగూలాచారి కుమారుడు చంద్రచారి రూ.5,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, బొడ్డేడ రామునాయుడు, పాలిమేర గణేష్, చంద్రపాటి లోకేష్, దాడి సూరిబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భక్తులతో శివాలయాలు కళకళ


వెంకటాపురంలోని నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని పలు శివాలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి. కార్తీక మాసంలోని తొలి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు శివాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాక, నాగులాపల్లి, టి.సిరసపల్లి, వెంకటాపురం తదితర ప్రాంతాల్లోని శివాలయాలకు భక్తుల తాకిడి ఉంది. ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, వీఆర్వోల సంఘ రాష్ట్ర నాయకుడు బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, తదితరులు నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు, కమిటీ పెద్దలు


ఆలయ పరిసరాల్లో విద్యుద్దీపాలంకరణ

యలమంచిలి రూరల్: పట్టణంలోని నాగేంద్ర కాలనీలో కొలువైన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కార్తీకమాస నవరాత్రి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 8న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 16తో ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు టేకి సోమశేఖరాచార్యులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆదివారం రాత్రి పూజల్లో సొంట్యాన అనిరుధ్, రమణి దంపతులు పాల్గొన్నారు. ముందుగా అష్టోత్తర పూజ, అభిషేకం, బిల్వార్చన చేశారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు సున్నం నాగేశ్వర్రావు, ఆవుపాటి సుబ్బారావు తదితరులు రాత్రి పూజల తర్వాత జరిగిన భజన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. చేశారు. ఉత్సవాల్లో భాగంగా కామాక్షి అమ్మవారి ఆలయ పరిసరాలు, రహదారులకు ఇరువైపులా భారీ విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. ఈ నెల 16న జరిగే గ్రామోత్సవంలో ఉదయం స్వామివారికి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పెద్ద సున్నం నాగు తెలిపారు.